

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నల్గొండ యాదాద్రి సూర్యాపేట

ఆదివారం 04, మే 2025 పేజీలు - 8


### నీట్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో

## పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి





**నల్గొండ జిల్లా బ్యూరో**

నీట్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రం, అలాగే మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్‌తో కలిసి తనిఖీ చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలోని రామగిరిలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలను, బందోబస్తు ఏర్పాట్లను తనిఖీ చేశారు. అనంతరం ఎంజి యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కాగా నీట్ అండర్ గ్రాడ్యుయేట్ -2025 ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7 కేంద్రాలు నల్గొండ జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. మహాత్మా గాంధీ యూనివర్సిటీలో 4 పరీక్ష కేంద్రాలు, ఎన్జీ కళాశాలలో ఒకటి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఒకటి, కేంద్రీయ విద్యాలయలో మరొక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం 2087 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను ఆమె తనిఖీ చేయడమే కాక పరీక్ష కేంద్రాల సూపరింటిండెంట్లు, నోడల్ అధికారి, సంబంధిత శాఖల అధికారులకు మరోసారి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షరాసే అభ్యర్థులు ఉదయం 11 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె కోరారు.

మిగతా 2లో

### వెంకటేశ్వర స్వామి

### ఆలయం(గుట్టకు) వెళ్ళే దారిలో

## భక్తులకు దుర్వాసనతో

## అసౌకర్యంగా చెత్త చెదారం

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామపంచాయతీ మాల్ వెంకటేశ్వర్ నగర్ రెండు జిల్లా కూడలిలో ఉన్నది. ప్రతి శనివారం వందలాదిమంది భక్తులు కొండపైకి వెళుతుంటారు. ఆ వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే ప్రజలు అక్కడ వచ్చే దుర్వాసన చూసి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.గ్రామపంచాయతీ సెక్రటరీలు వెంటనే చెత్తాచెదారాన్ని శుభ్రం చేసే ఏర్పాటు చేయాలని భక్తులు ,స్థానిక ప్రజలు కోరారు.



### నేడు హుజూర్‌నగర్, కోదాడలో

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన



కోదాడ, మేజర్‌న్యూస్ : హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలలోలో నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు శనివారం కోదాడ ఎమ్మెల్యే కార్యాలయం నుండి వివరాలను వెల్లడించారు. ఉదయం 08.30 గంటలకు హుజూర్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో నియోజవర్గ పరిధిలోని 241 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు అని, అక్కడనుండి కోదాడలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డితో కలిసి 9.30 గంటల నుండి 12 గంటల వరకు కోదాడలో వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణతో పాటు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి స్థల పరిశీలన చేస్తారు అని, అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కోదాడ నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై సమీక్ష చేస్తారు అని తెలిపారు. ప్రధానంగా ఈ సమీక్షలో రెడ్లకుంట ఎత్తిపోతల పథకం, శాంతినగర్ ఎత్తిపోతల పథకం, పాలేరు నుండి మోతే మండలానికి ప్రతిపాదించబడుతున్న ఎత్తిపోతల పథకం, ఎన్ఎస్‌పి కాలువపై ఉన్న ఇతర ఎత్తిపోతల పథకాలపై చర్చిస్తారు అని వెల్లడించారు.

## ప్రతానం కార్యక్రమంలో పాల్గొన్న

## కట్టెబోయిన అనిల్ కుమార్

వివరాలు 8లో

### స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి

## నిత్య కళ్యాణోత్సవం



భువనగిరి, మేజర్‌న్యూస్ : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మ వారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు.ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వర్ణగిరి క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు,పసుపు,సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు.ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 4500 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 6:30కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

# కొప్పోలు వాసి హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండలం కొప్పోల్ గ్రామానికి చెందిన మన్నెం చిన్న లింగయ్య – జానమ్మ కుమారుడు మన్నెం నవీన్ యాదవ్ నేడు హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతి ఒక్కరికీ చట్టపరంగా సరైన న్యాయం జరగడమే తన లక్ష్యం అని, నిరుపేదలకు, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు. రైతు కుటుంబం నుంచి హైకోర్టు న్యాయవాదిగా ఎదిగిన ప్రయాణానికి గ్రామ ప్రజలు, నాయకులు పలువురు అభినందనలు తెలిపారు.

# దేవాలయంలో హుండీలు, ఆభరణాలు జాగ్రత్త

## ఎస్ఐ మధు



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : గుర్రంపోడ్ మండల ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి ఏమనగా, మీ గ్రామ పరిదిలోని దేవాలయాలలో విలువైన ఆభరణాలు కానీ, హుండీలో డబ్బులు కానీ జాగ్రత్త చేసుకోగలరు, అదే విధంగా మీ గ్రామంలో దేవాలయాలలో ఖచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోని, దొంగతనాలను నియంత్రించగలరు. అపరిచిత వ్యక్తుల మీద అనుమానం వస్తే పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరని మనవి.

## అవినీతి పనులను కప్పి పుచ్చుకోవడానికే

# మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే బిఎల్ఆర్ పై అవాకులు చవాకులు



మిర్యాలగూడటౌన్,మేజర్‌న్యూస్ః అవినీతి పనులను కప్పి పుచ్చుకోవడానికి మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై అవాకులు చవాకులు పేలుతున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు.శనివారం పట్టణంలోని మినీ రవీంద్ర భారతిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ రవీంద్ర భారతి పేరుని ఎలాంటి అనుమతులు లేకుండా వారి ఇష్టారాజ్యంగా కేసీఆర్ కళాభారతిగా నామకరణం చేయడం ఎంత వరకు సమంజసమో మీడియా మిత్రులకు తెలుసు అన్నారు. మినీ రవీంద్రభారతి 2006 లో కాంగ్రెస్ పార్టీ ఎంపి జైపాల్‌రెడ్డి తీసుకవచ్చినటువంటి నిధులతో శంకుస్థాపన చేసుకుని దాని నిర్మాణ ప్రారంభం చేయడం జరిగిందని ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి రూ. కోటి 30 లక్షల నిధులను తీసుకరావడం జరిగిందని,మిగిలిన మొత్తాన్ని టిఎఫ్‌యూఐడిసి నిధుల ద్వారా తీసుకవచ్చి దాదాపుగా 9 కోట్ల చిల్లర వ్యయంతో మినీ రవీంద్రభారతిని నిర్మాణం చేయడం జరిగిందని, దీనిలో మొదటగా కాంట్రాక్టు తీసుకన్నటువంటి వారు నష్టపోయే విధంగా బిఆర్ఎస్ పార్టీ బిల్లు రాకుండా చేసి వారిని దివాలా తీయించి ఆ పనులను బాస్కర్‌రావు వారి బినామీలకు ఇప్పించి అంచనాలను పలుమార్లు మార్చి బిల్లులు అధికంగా రాయించుకుని నాసిరకం పనులు చేసినటువంటి ఘతన మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుదేనని అన్నారు. సెంట్రల్ ఏసీ చేయించానని చలా గొప్పగా చెప్పుకున్నారని అన్నారు. ఎంపీ రఘువీర్, ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మరొకసారి ఇలా మాట్లాడితే ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు, మాజీ ఎంపిటిసి బెజ్జం సాయి, మాజీ జడ్‌పిటిసి నాగునాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిలి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, పాతూరు ప్రసాద్, బండి యాదగిరిరెడ్డి,రుణాల్‌రెడ్డి, రవినాయక్, కొమ్మన నాగలక్ష్మి, పందిరి అనిత, ఆలగడప గిరిధర్ పాల్గొన్నారు.

# తెలంగాణ మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం



గుర్రంపోడ్, మేజర్‌న్యూస్ : పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల కొరకు తెలంగాణ మోడల్ స్కూల్ మే 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా సేకరించబడుతుందని గుర్రంపోడు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.రాగిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులందరూ ఈ అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మే 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు తీసుకోబడతాయని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక జాబితాలో అవకతవకలు

మోత్కూర్, మేజర్‌న్యూస్ : మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి ఎంపిక చేసిన తుది జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శనివారం ఎంపీడీవోకు గ్రామస్తులు వినతిపత్రం అందచేశారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ కార్యదర్శి తుది లిస్టు పొందుపరచడంలో విఫలమయ్యారని, ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకొని, పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు టి.భాస్కర్, సిహెచ్ సైదులు, టి.యాదయ్య, ఎం మల్లేష్, టి.యాదగిరి, కె.లక్ష్మి, ఎం.సుజాత, మారయ్య, చంద్రయ్య, సాయిలు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ఈఈయూ 327 యూనియన్ ఆధ్వర్యంలో

# ఘనంగా మేడే ఉత్సవాలు



మునుగోడు, మేజర్‌న్యూస్ : మునుగోడు మండల కేంద్రంలో తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 327 యూనియన్ మునుగోడు సెక్షన్ లీడర్ పెరుమాల్ల నరసింహ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమములో ఐఎన్టియుసి, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కాం ప్రెసిడెంట్ ఏం.సురేష్ కుమార్ పాల్గొని యూనియన్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ కార్మికులు ఆర్టిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలు సాధన కోసం 327 యూనియన్ పని చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నల్గొండ డివిజన్ ప్రెసిడెంట్ కే.సమ్మిరెడ్డి,సెక్రటరీ పాండు, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకరయ్య, సెక్షన్ లీడర్ పెరుమాళ్ళ నరసింహ, సిహెచ్ నాగయ్య స్వామి రెడ్డి, వెంకటరమణ భిక్షమయ్య, ముత్యం, వరప్రసాద్, మోహన్ రెడ్డి,అనిల్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత పరీక్ష కేంద్రం ప్రధాన గేట్లను మూసివేయడం జరుగుతుందని పునరుద్ఘాటించారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు అన్నింటిని మరోసారి పరిశీలించుకోవాలని ముఖ్యంగా తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు, మెడికల్ సౌకర్యాలు, తదితర అన్నింటిని పునః పరిశీలించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ చంద్ర పవర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ రాజ్ కుమార్, అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాం రెడ్డి, నీట్ నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలకు వెసులుబాటు కల్పించాలి

## సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి



మునుగోడు, మేజర్‌న్యూస్ : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిరుపేదలకు వెసులుబాటు కల్పించాలనీ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి మండలంలోని చీకటిమామిడి గ్రామంలో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసినా అనంతరం సిపిఐ గ్రామ శాఖ మహాసభలో వారు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిరుపేదలను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. అనంతరం సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ పథకంలో ఇల్లు ట్రాక్టర్లు కార్లు కలిగిన వారికి కాకుండా నిరుపేదలని ఎంపిక చేయాలని కోరారు.600 చదరపు అడుగుల నిబంధనను తొలగించి బేస్మెంట్లు రేకుల ఇల్లు నిర్మించుకున్న వాళ్లకి పునర్నిర్మానం చేసుకొనుటకు అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామంలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త తమ వంతు కృషి చేయాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే కమ్యూనిస్టు పార్టీలో ప్రజలు భాగస్వాములు కావాలని పార్టీ నిర్మాణానికి పనిచేయాలని అన్నారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల కల్పన పై చర్చించినారు. ఈ మహాసభలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి సహాయ కార్యదర్శి ఏర్కొండ యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా ఏర్కొండ నాగేషు, చింతల రమేష్, రాకేష్ చింతల వెంకటయ్య, మేడి చంద్రయ్య, పాలకూరి కాటమయ్య, పుల్కారాం రాములు, టీ.సైదులు తది తరులు పాల్గొన్నారు.

# డాక్టర్ మాధురి, డాక్టర్ దిలీప్‌ల పెళ్లిరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ

భువనగిరి, మేజర్‌న్యూస్ : భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, డాక్టర్ నల్ల మాధురి డాక్టర్ దిలీఫ్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా భువనగిరి బస్టాండ్ ఆవరణలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. భువనగిరి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రాచమల్ల వినోద్ కుమార్ ( వీరభద్ర షాపింగ్ మాల్) కుమార్తె, అల్లుడైన డాక్టర్ మాధురి డాక్టర్ దిలీప్ ల వివాహ మహెూత్సవం సందర్భంగా భువనగిరి బస్ స్టేషన్ లో ప్రయాణికులకు, ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సేవా సమితి భువనగిరి సభ్యులు సోమ కృష్ణమూర్తి, చింతపండు రాజు, పెంట బాలరాజు, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ తదితరులు దంపతులను ఆశీర్వదించారు.



# అక్రమంగా తరలిస్తున్న ధాన్యం పట్టివేత

### – ఏడు లారీలు ఒక డిసిఎం పై కేసు నమోదు
### – వివరాలు వెల్లడించిన డియస్పీ రాజశేఖర్‌రాజు






మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : ఆంధ్రాలో రైతుల నుండి బ్రోకర్లు తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగ్లో చేసి ఆ ధాన్యాన్ని తెలంగాణలో మధ్యవర్తుల ద్వారా రైతుల పాస్ పుస్తకాలతో ఐకెపి సెంటర్‌లలో ధాన్యాన్ని అమ్మటానికి వచ్చిన లారీలను పట్టుకున్నట్లు డియస్పీ రాజశేఖర్‌రాజు తెలిపార. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్ ఆదేశానుసారం ఆంధ్ర నుండి వస్తున్న ధాన్యాన్ని రెవిన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో వాడపల్లిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘాను పెంచామని, ఎవరైతే దళారులను నమ్మి ధాన్యాన్ని అధిక మొత్తంలో డబ్బు ఆశతో అమ్మడానికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలో ఐకెపి సెంటర్‌లలో అమ్మిన ధాన్యానికి బోనస్ వస్తుందని కొంత మంది దళారులు రైతుల ద్వారా ఐకెపి సెంటర్‌లలో అమ్మి సొమ్ము చేసుకోవాలని చూస్తే సహించేదిలేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రా నుండి లారీల ద్వారా ధాన్యాన్ని తీసుకవస్తే చె క్‌పోస్టుల దగ్గర నిలిపి వెనక్కి పంపడం జరుగుతుందని, 365 రోజుల పాటు చెక్ పోస్టుల ద్వారా పోలీసుల పర్యవేక్షణ నిత్యం ఉంటుందన్నారు. అక్రమంగా ధాన్యాన్ని తెచ్చి బ్రోకర్ల ద్వారా రైతులను మోసం చేస్తున్నారని ఇలాంటివి మరలా పునరావృతం కాకుండా కట్టదిట్టమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 2250 బ్యాగుల ధాన్యాన్ని పట్టుకున్నట్లు, ఇట్టి తీసుకవచ్చి హుజూర్‌నగర్, ఘూనాపూర్‌లకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 7 కేసులు నమోదు చేశామని, అసలు సూత్రధారి ఎవరనే ధానిపై దర్యాప్తు జరుగుతుందని, పూర్తి నివేదికను త్వరలో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ ప్రసాద్, ఎస్ఐ లక్ష్మయ్య, అడవిదేవులపల్లి ఎస్ఐ శేఖర్, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

# మోర శ్రీరాములు బైకు దగ్ధం

### విచారణ జరుగుతున్న చింతపల్లి పోలీసులు



చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండలం కిష్టరాయినీ పల్లి గ్రామంలో శుక్రవారం అర్ధ రాత్రి గ్రామానికి చెందిన మోర శ్రీరాములు చెందిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. అర్ధరాత్రి బహిర్ భూమికి వెళ్లిన అతని తండ్రి రామచంద్రం గ్రామపంచాయతీ ముందు నిలిపించిన పల్సర్ బైక్ మంటల్లో మండు తుండగా చూసి తన కుమారుడు రాములకు తెలియజేశారు. వెంటనే మంటలను ఆర్పేశారు. తన ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని చింతపల్లి పోలీస్ స్టేషన్లో మోర శ్రీరాములు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.యాదయ్య తెలిపారు.

# కరెంట్ షాక్‌తో పాడి గేదే మృతి



అడ్డగూడూర్ మేజర్ న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని కోటమర్తి గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో పాడి గేదే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు చిన్నబోయిన ప్రహాలాద తెలిపిన వివరాల ప్రకారం రోజువారిగా శనివారం ఉదయం పాడి గేదే మేతకు వెళ్లి మేసుకుంటూ నిన్న రాత్రి వచ్చిన ఈదురు గాలులకు పొలంలో సర్వీస్ వైరు తెగి పడడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగకు తగిలి పాడి గేదే అక్కడికక్కడే మృతి చెందిందని రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. గేదే విలువ సుమారుగా 80,000 రూపాయలు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోని నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కంకర తరలింపు వాహనాలపై అధికారుల నిర్లక్ష్యం



నేరేడుచర్ల,మేజర్‌న్యూస్: గరిడేపల్లి మండలంలోని అప్పన్నపేటకు సమీపంలో రాతి నిక్షేపాలు అధికంగా ఉండటంతో స్టోన్ క్రషర్ మిల్లులో ఏర్పాటు చేసిన అన్ని సైజుల కంకరతో పాటు రోబో సౌండ్ నో వివిధ ప్రాంతాలకు వాహనాల ద్వారా నిత్యం తరలిస్తూ ఉంటారు. అతివేగంగా వచ్చే వాహనాలలో సామర్థ్యానికి మించి కంకర, ఇసుక తరలింపులో వాహన, మిల్లు యజమానులు కనీసం నిబంధన అయిన ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పట్టాలు కట్టి తోలాల్సి ఉన్న ప్రధాన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వెళుతూ ఉండటం ప్రధాన రహదారితో పాటు ఇతర రహదారుల్లో కంకర వెనుక వచ్చే వాహనాలకు ఇబ్బంది కలిగేలా జారిపడిపోతూ ఉండటం నిత్యకృత్యం. వాటి వలు సందర్భాల్లో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతూ ఉన్న ప ట్టించుకునేనాథుడే కరువయ్యారు. నిత్యం రోడ్లపై కంకర పడటంతో వాహనాలకు పంచర్లు కావడం సర్వసాధారణం. వీటికి తోడు వాహనదారుల కళ్లల్లో పడి పలువురికి ఇబ్బంది జరిగిన పరిస్థితి. లైట్ మోటార్, ఇతర వాహనాలకు కంకర జారిపడి వారి వాహనాల అద్దాలు పగిలిన సందర్భాలు ఉన్నాయి. ఇలా పలు సమస్యలకు కారణమవుతున్న స్టోన్ క్రషర్స్ ముడి సరుకు రవాణా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పట్టాలు కట్టుకోకుండా యధేచ్ఛగా నియంత్రించాల్సిన ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే వెళ్తున్న నిత్యం రోజు కనిపిస్తున్న ఒక్కరు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. నిత్యం జరిగే ప్రజల ఇబ్బందులను గమనించి సంబంధిత అధికారులు స్టోన్ క్రషర్ యజమాన్యానికి తమ బాధ్యతలను గుర్తు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉన్నత చదువుల నిమిత్తం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

నేరేడుచర్ల,మేజర్‌న్యూస్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లాలో తృతీయ ర్యాంకు సాధించిన మండల పరిధిలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దామరచర్ల ప్రణవికి ఉన్నత చదువుల నిమిత్తం జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి సరికొప్పుల నాగేశ్వరరావు విద్యార్థి ప్రణవిని సన్మానించి రూ.4వేల ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువున్న విద్యార్థులకు సహాయం చేయడం జరిగిందన్నారు.కార్యక్రమంలో సరికొప్పుల విజయలక్ష్మి,వరమ్మ,సాయిచరణ్, చందు,కొమ్మరాజు శ్రీణు, ప్రసాద్, అంజి, రవి,అర్జున్, జింకల భాస్కర్,దేవిరెడ్డి నాగిరెడ్డి, ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, జనసైనికులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో 1999–2000 బ్యాచ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

బీబీనగర్, మేజర్‌న్యూస్ : మండలంలోని వెంకిర్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రతి శనివారం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తారు.అదేమాదిరిగా శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కసిరెడ్డి ఇంద్రనారాయణ రెడ్డి, డెరెక్టర్ చెరుకు బాలరాజు గౌడ్, చింతల సురేందర్, చెరుకు కుమార్, నాకీర్త అశోక్, జంగా సతీష్, బూరుగుపల్లి ప్రవీన్, కుంభం రమేష్, వెంకటేష్, కనకాచారి, మెరుగు ప్రభాకర్, పొన్న పాండు, నరసింహ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తుంగతుర్తి అభివృద్ధే లక్ష్యంగా మంత్రి ఉత్తమ్ పర్యటన

### ఎమ్మెల్యే మందుల సామెల్
### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తిరుమలగిరి మేజర్ న్యూస్ : తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్ర నీటిపారుదల శాఖ, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలోని తన స్వంత గ్రామమైన తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ తెలిపారు. దాదాపు 60 కోట్లతో బిక్కేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, 60 లక్షలతో పూర్తయిన సిసి రోడ్లు ప్రారంభం, 25 లక్షలతో నూతన సిసి రోడ్లకు శంకుస్థాపన, మహిళలకు 500 కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తవుతున్న సందర్భంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లకు ఉచిత కరెంట్, సన్న వడ్లకు 500 బోనస్, నియోజకవర్గంలో 40 లక్షల కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో ఒక గుంట పంట ఎండిపోలేదని ఎస్సారెస్పీ కాల్వ, గండ్లమల్ల రిజర్వాయర్ ద్వారా బిక్కేరు వాగులోకి నీటిని విడుదల చేసి రైతులకు ఏలాంటి నష్టం కలగకుండా నీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. నాలుగు ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతుబంధు ఇచ్చామని అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రంలో నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి సిఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగులు, యువకుల కోసం రాజీవ్ యువ వికాసంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10 సంవత్సరాలుగా పట్టి పీడిస్తున్న ధరణి భూతం వీడిందని ధరణితో రాష్ట్రానికి దరిద్రం పోయిందని అన్నారు. రైతుల భూములకు, ఇళ్ల స్థలాలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా సిఎం రేవంత్‌రెడ్డి అంబేద్కర్ జయంతి సందర్భంగా భూభారతి చట్టం ప్రారంభించారని ఈ చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. నియోజకవర్గంలోని జూనియర్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనాలు త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. నేడు జరిగే మంత్రి పర్యటనలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, నాగారం మండల అధ్యక్షులు లింగయ్య, కందుకూరి అంబేద్కర్, కందుకూరి లక్ష్మయ్య, బత్తుల శ్రీను, హఫీజ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నిధులతో

# లెంకలపల్లి గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్



మర్రిగూడ, మేజర్‌న్యూస్ : వేసవికాలం కావడంతో మండలంలోని లెంకలపల్లి గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్ లోడ్‌కు గురికావడం విద్యుత్‌లో వోల్టేజీ సమస్య ఉందని స్థానిక నాయకులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన రాజగోపాల్ రెడ్డి తన సొంత నిధులతో గ్రామానికి 25 కే.విడిటిఆర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల విద్యుత్ అధికారి వంశీ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సేవలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉన్నారు.

# గుండ్రాంపల్లిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



చిట్యాల, మేజర్‌న్యూస్ : చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కంకల శిరీష 540, అన్నబోయిన సంజన 527, బంధారపు అక్షిత 517, అబ్దుల్ ఖాజా ఖదీర్ 513, మోక్షిత 506 విద్యార్థులకు శనివారం సింగిల్ విండో వైస్ చైర్మన్ ఆవుల నాగరాజు మెమెంటోలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరెడ్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు పదవ తరగతి తర్వాత మనకు జీవితంలో ఉపయోగపడే కోరికలలో చేరాలని ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసులు, పి వెంకట్రావు, అబ్దుల్ షరీఫ్, రామ్ రెడ్డి, వై.నరసింహ, కే.ప్రణయ్, బి.రేణుక, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగారం మేజర్ న్యూస్ ః నాగారం మండల పరిధిలోని పసునూరులోని మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఈసి, ఎంఈసి గ్రూపులకు 40 అడ్మిషన్ల చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నాయని పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.




# రవీందర్‌కు నివాళులర్పించిన చిరుమర్తి



చిట్యాల, మేజర్‌న్యూస్ : చిట్యాల మండలంలోని బోయగుబ్బ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బొమ్మగోని రవీంధర్(42) గుండెపోటుతో ఈ నెల 01వ తేదిన మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య రజిని, ఇద్దరు పిల్లలను శనివారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరామర్శించారు. మృతుడి కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలిపి ఓదార్చాడు. మృతుడు కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన అన్నారు. రవీంధర్ ప్లెక్సికి మాజీ ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆనంతరం ఆ గ్రామానికి చెందిన శ్రీమన్నారాయణ లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ తరపున మృతుడు రవీంధర్ కుటుంబ సభ్యులకు లక్ష పది వేల రూపాయ ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ జనగాం నర్సింహ్మాగౌడ్, నాయకులు బోయపల్లి శ్రీనువాస్ గౌడ్, రూపని రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన పంతంగి ముత్యాలు ఇటివల ఆనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి కుమారుడు గణేష్ సభ్యుడయని ఫ్రెండ్స్ యూత్ తరపున ముప్పయి వేల రూపాయల ఆర్థిక సహాయంను అందజేశారు.

# నిత్య కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు




యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మినరసింహస్వామి పుణ్య క్షేత్రంలో శనివారం భక్తులు స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయంలో నిత్య ఆరాధనలు, కళ్యాణంతో పాటు, సుదర్శన నరసింహ హోమం పర్వాలు శాస్త్రపరంగా జరిగాయి. సుప్రభాతంతో పంచనారసింహులను మేలుకొల్పి పూజారులు ఆరతి నివేదన జరిపి ఉత్సవమూర్తులను పంచామృతంతో అభిషేకించారు. దర్శనమూర్తులకు స్వర్ణపుష్పార్చన జరిపి అలంకరించారు. వేదమంత్రాలతో సుదర్శన నారసింహ హోమం జరిగింది. విశ్వక్సేన ఆరాధనతో పాంచరాత్ర ఆగమశాస్త్రనుసారంగా నిత్య కళ్యాణం చేపట్టారు. సాయంత్రం అలంకార సేవ ప్రతిష్టామూర్తులకు ఆరాధన జరిపారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారికి ఆరగింపు అనగా నివేదన తదుపరి ద్వారబంధన. శనివారం వివిధ కైంకర్యాలలో వచ్చిన ఖజానా 33,24,451.

# 10లో అధిక మార్కులు సాధించిన విద్యార్థికి సన్మానం

నేరేడుచర్ల, మేజర్‌న్యూస్ ః పదవ తరగతి ఫలితాలలో అత్యధికంగా 561 మార్కులు సాధించిన పట్టణానికి చెందిన కందిబండ సురేష్‌నర్మదా దంపతుల కుమారుడు అయిన కందిబండ వేదస్వరూప్‌ను శనివారం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గరిణె జ్యోతి, రాచకొండ శ్రీనివాసరావు, కొత్త లక్ష్మణ్, కందిబండ వాసంతి, వీరవెల్లి శ్రీలత, గెల్లి లక్ష్మీనరసింహారావు, లక్ష్మీప్రసన్న, నటరాజు, గోపాలకృష్ణ, విజయ, శైలజ, ఉర్మిలా పాల్గొన్నారు.

### ముదిమణిక్యం గ్రామములో

# ఇందిరమ్మ ఇండ్లు కట్టుకొనుటకు స్థలములు కేటాయించాలి







అడవిదేవులపల్లి, మేజర్‌న్యూస్ : శనివారం ముదిమణిక్యం గ్రామములో ఇందిరమ్మ ఇండ్లు కట్టుకొనుటకు స్థలములు కేటాయించాలని ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ కలిసి గ్రామంలోని ప్రభుత్వ స్థలములలో కొత్త ఇందిరమ్మ కాలనీ నిర్మించుటకు స్థలములు కేటాయించమని కోరటం జరిగింది. అలాగే గ్రామంలో వున్నా నీటి సమస్యను పరిష్కరించాలని కోరిన ముదిమాణిక్యం గ్రామ ప్రజలు.

### ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి త్వరగా

# రైతులకు బిల్లులు అందే విధంగా చూడాలి

### డిఆర్డిఓ పిడి వై.శేఖర్ రెడ్డి



మునుగోడు, మేజర్‌న్యూస్ : ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసి రైతులకు త్వరగా బిల్లులు అందే విధంగా చూడాలనీ డిఆర్డిఓ పిడి వై.శేఖర్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోనీ కొరటికల్, పలివెల, కిష్టాపురం డిఆర్డిఏ సెర్ప్ (ఐకెపి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తేమ శాతం 17 లోపు ఉండే విధంగా చూసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొని రావాలన్నారు. తాలు, మట్టి మట్టి పేల్లలు ఉంటే తూర్పార పట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురాలన్నారు. కోనుగోలు చేసిన దాన్యాన్ని మిల్లులకు తరలించాలని తెలిపారు. ఆయన వెంట ఐకెపి ఏపియం డి..మైసేశ్వరరావు, సిసిలు శ్రీనివాస్, శంకర్, మల్లేశ్వరి, విఓఏ బేరీ నరసింహ, గోసుకొండ మల్లేష్, రాములు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలలో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం.మేజర్‌న్యూస్ః ధాన్యం కొనుగోలలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం నారాయణపురం మండలంలోని గుడిమల్కాపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారిని అడిగి తెలసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధ్యానం కొనుగోలలో వేగం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డివో శేఖర్ రెడ్డి, తహ శీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడివో ప్రమోద్ కుమార్, ఎస్సై జగన్, ఆర్ఐ కట్ట పాండు, ఏఈఓ శశిబిందు, పిఎస్‌సిఎస్ సిఈఓ శేఖర్, రైతులు పాల్గోన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే కులగణనను ఒప్పుకున్న నరేంద్రమోదీ



చౌటుప్పల్,మేజర్‌న్యూస్‌: బీసీలకు రాబోయే జనగణనతో పాటు కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం రాహుల్ గాంధీ ఒత్తిడితోనేనని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక రమేష్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని,రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఒత్తిడితోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్రలో హామీ ఇచ్చారని, తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చి ప్రధాని మోడీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చారన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ రాష్ట్రం ఆదర్శమన్నారు.

**నేరేడుచర్ల :** ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి



జనగణన, కులగణన విషయంలో కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల శనివారం బిజెపి పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహించబడుతుందని, కోవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో జనగణనతో పాటు కులగణన చేయడం వలన సామాజిక, ఆర్థిక పరిస్థితిని లెక్కించి దానికి అనుగుణంగా రిజర్వేషన్లు విద్యా,ఉద్యోగ అవకాశాల కేటాయింపుల్లో సమన్యాయం సాధించడానికి సహాయపడుతుందన్నారు. స్వాతంత్ర్యం తరువాత దశాబ్ధాల తరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కూడా సమగ్ర కులగణన చేయలేద న్నారు. కార్యక్రమంలో సంకలమద్ది సత్యానారాయణరెడ్డి, నరీనాయక్, మెట్టు శ్రీనివాసరెడ్డి, తాళ్లూరి రమేష్ నాయుడు,మెట్టు మధు,తాళ్ల నరేందర్ రెడ్డి, కాలం నాగయ్య,జూలూరి అశోక్, కదారి ఎల్లయ్య, దేవిరెడ్డి నాగిరెడ్డి,యడవెల్లి సైదిరెడ్డి, వాసు, శావయ్య, నారద మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



భూదాన్‌పోచంపల్లి, మేజర్‌న్యూస్ : భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన గరిసె ఆశిష్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఇంద్రియాల బిఆర్ఎస్ పార్టి గ్రామశాఖ నుండి బిఆర్ఎస్ కార్యకర్తల సహకారంతో రూ.45,000ల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమములో మాజి సర్పంచ్ బండి కృష్ణ, మాజి ఎంపీటీసిలు మొగిలిపాక యాదగిరి, ఎడునోజు రాజనారాయణ, ఎర్ర వెంకటేష్, దిరావత్ వెంకటేష్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు పెద్దిరెడ్డి యాదగిరి, గరిసె జంగయ్య, సుర్వి బాల్ రాజు, చెవ్వగొని బాలకిషన్, దిరావత్ మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ భువనగిరి ఆధ్వర్యంలో సన్మానం




భువనగిరి, మేజర్‌న్యూస్ : ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో పాటు యాదాద్రి జిల్లా మొదటి ర్యాంకు సాధించిన విజ్ఞాన్ హైస్కూల్ భువనగిరి విద్యార్థిని ముడుగుల అక్షయను, మిగతా విద్యార్థులను రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ భువనగిరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అనీఫ్ మెమన్ మాజీ అధ్యక్షుడు పక్కిర్ కొండల్ రెడ్డి, డైరెక్టర్ జిల్లాల కొండల్ రెడ్డి, హతహర్ మరియు విజ్ఞాన్ గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ పగిడాల జలంధర్ రెడ్డి, కరస్పాండెంట్ పురంధర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య



మోత్కూర్, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందని, విద్యార్థి సంపూర్ణ వికాసానికి ప్రభుత్వ పాఠశాలల్లోనే అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యాబోధన ఉంటుందని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంచార్జ్ మండల విద్యాధికారి తీపిరెడ్డి గోపాల్ రెడ్డి అన్నారు. 2025 సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 500కు పైబడి మార్కులు సాధించి మండల స్థాయిలో పాఠశాలను ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థులను అభినందించారు. 541 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించిన దేవినేని అర్చన, 540 మార్కులతో రెండవ స్థానంలో నిలిచిన శివానిలతో పాటు, అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అక్షయశ్రీ 538, రోషన్, నాగసాయి 510, సుష్మ శ్రీ 502,గణేష్ 501 మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు అమృత వర్షిణి, మహేశ్వరి, దివ్య, సాయపూజిత, రమ్యశ్రీ, అనిల్, దీపిక, శ్రీజలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, ఇ.రాంప్రసాద్, జి రవీందర్ రెడ్డి, జక్కుల రవికుమార్, బి.లింగయ్య, మర్రి జయశ్రీ, ఎం.అశోక్, రేవతి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందచేత

మోత్కూర్, మేజర్‌న్యూస్ : మోత్కూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన స్వీపర్ (స్కావెంజర్) ఇట్టేబోయిన లక్ష్మయ్య ఆకస్మికంగా మరణించినందున వారి కుటుంబ సభ్యులకు ప్రస్తుత, పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల నుండి సేకరించిన మొత్తం రూ 63600ల ఆర్థిక సాయంను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్ రెడ్డి అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రాంప్రసాద్, జయశ్రీ, ఎ వెంకటాచారి, గుజ్జ సోమనర్సయ్య, పి.మురళి, బయ్యని రాజు, ఎండి నిజాం, జె రవి, డి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల బీభత్సం

# అల్‌మన్స్ డెయిరీ ఫార్మ్‌లో భారీ ఆస్థి నష్టం



భువనగిరి, మేజర్‌న్యూస్ : గత రాత్రి కురిసిన అకాల వర్షాలతో భువనగిరి జిల్లా, మగ్దంపల్లి రోడ్డులో, బోమ్మైపల్లి రైల్వే స్టేషనుకు సమీపంలో ఉన్న అల్‌మన్స్ డెయిరీ ఫార్మ్ (సర్వే నం. 722, 723, 724)లో తీవ్ర నష్టం సంభవించింది. ఒకే సారి షెడ్ కులడం వల్ల గేదెలకు తీవ్ర గాయాలు, పంట పొలాలు నీటమునిగిపోయాయి మరియు భారీ షెడ్లు ధ్వంసమయ్యాయి కరెంట్ పోల్ వైర్ల తెగి పడ్డాయి పంట పూర్తిగా నీటి పాలయ్యింది. ఈ ఫార్మ్ యాజమాన్యమును షైనాజ్ బేగం, ముహమ్మద్ అరిఫ్, మరియు ముహమ్మద్ అబ్దుల్లా నిర్వహిస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం జరిగింది. అంచనా ప్రకారం నష్టం 5 లక్షల రూపాయలు వరకు ఉంటుంది అని అంచనా వేసారు. ఈ సందర్భంగా రైతు షహనాజ్ బేగం మీడియాతో మాట్లాడుతూ మా జీవనాధారం కేవలం కొన్ని గంటల్లో కుప్పకూలిపోయింది. గేదెలకు తీవ్ర గాయాలు కావడం, పెద్ద షెడ్లు ధ్వంసం కావడం మాకు తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు మాకు తక్షణ ఆర్థిక సహాయం చెయ్యాలి అని విజ్ఞప్తి చేసారు.

### కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం

# నిరంతరం శ్రమిస్తున్న యూనియన్ ఐఎన్‌టియూసి

### – ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్



హుజూర్‌నగర్ రూరల్, మేజర్‌న్యూస్ : కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం నిరంతరం శ్రమిస్తున్న యూనియన్ ఐఎన్‌టియూసి అని ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరా భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 78వ ఐఎన్‌టి యూసి ఆవిర్భావ దినోత్సవ వేడుకులను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్నగౌడ్ ఐఎన్‌టియూసి నాయకులు,కార్మికులతో కలసి కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1947 మే 3న ఐఎన్‌టియూసిని మహాత్మగాంధీ, జవహర్‌లాల్‌నెహ్రూ, సర్దార్ వల్లభాయ్‌పటేల్ నేతృత్వంలో స్థాపించడం జరిగిందని, నేడు ఐఎన్‌టియూసి జాతీయ అధ్యక్షులు డా.జి. సంజీవరెడ్డి ఆధ్వర్యంలో భారతదేశంలో 3 కోట్ల 90 లక్షల కార్మిక సభ్యత్వాన్ని కలిగిన అతిపెద్ద ట్రేడ్ యూనియన్‌గా నిలిచిందన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచనలతో, ప్రభుత్వరంగ కార్మిక యూనియన్లను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తన్నీరు మల్లిఖార్జున్‌రావు, ఐఎన్‌టియూసి నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ గురవయ్య, మేళ్లచెర్వు ముక్కంటి, పాశం రామరాజు, జానయ్య, యోహాన్,షేక్ జాన్‌సైదా,కస్తాల దిల్,లలిత, సుబ్బరావు పాల్గొన్నారు.

## మే 20న జరిగే దేశవ్యాప్త

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### – కల్లూరి మల్లేశం సిఐటియు జిల్లా కార్యదర్శి



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మే 20న జరిగే దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొబ్బరికాయల హమాలీ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక కొబ్బరికాయల యజమానులకు మే 20 సమ్మె నోటీస్‌ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నదని విమర్శించారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ, ట్రాన్స్ పోర్ట్ రంగం లాంటి కార్మికులకు కనీసం సంక్షేమ బోర్డు ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాల కాలంలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని ఈ లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులను ఆధునిక బానిసత్వంలోకి నెట్టే కుట్ర చేశారని దుయ్యబట్టారు. కార్మికుల 8 గంటల పనిని 12 గంటలకు పొడిగించి కార్మికులపై వారికున్న మనువాద భావజాలాన్ని నిరూపించుకున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్మిక హక్కుల సంక్షేమాన్ని విస్మరించి 2025 –26 బడ్జెట్లో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేటాయింపులు చేసిందని నేటికి 16 లక్షల 35 వేల కోట్లు రూపాయలు కార్పొరేట్‌లకు రాయితీలు ఇచ్చారని, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టారని విమర్శించారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు, కార్మిక హక్కులను కాపాడుకునేందుకు జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు కలిసి మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని జిల్లాలోసంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ,ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చుక్కల కృష్ణ, బండ శ్రీశైలం, నాయకులు చుక్కలు పెద్ద వెంకటయ్య, నగేష్, మల్లేష్, అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు మాటలు మానుకోవాలి

### బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శీను




యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న చారిత్రాత్మక కుల గణన నిర్ణయానికి భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యం లో పాలాభిషేక కార్యక్రమం ముఖ్యఅతిథిగా రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ రచ్చ శీను ఈ సందర్భంగా రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న కుల గణన నిర్ణయం చరిత్ర ఆత్మకమైంది వారికి కృతజ్ఞతలు తెలుపుతూ యాదగిరి పట్టణ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. మోడీ ప్రభుత్వ నిర్ణయం వల్ల సామాజిక న్యాయం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన తప్పుల తడక అని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బూటకపు మాటలు మానుకోవాలని వారు హెచ్చరించారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన న్యాయం జరుగుతుంది. అని వారికి కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ నాయకులతో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, యాదగిరిగుట్ట పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి భానుచందర్ గౌడ్, పట్టణ కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్, యాదగిరిగుట్ట పట్టణ బీజేవైఎం అధ్యక్షులు బోద బుచ్చిబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మందోజు నరేష్, సీనియర్ నాయకులు భోంగిరి శ్యామ్ సుందర్, బెలిదే అశోక్, ఎరుకల చైతన్య గౌడ్, ఆలేటి కర్ణ, ఆవుల సత్యనారాయణ, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పలుగుల సురేష్, ఆకుల దేవేందర్ పట్టణ ఓబిసి పలువురు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మోరీలను శుభ్రం చేస్తున్న మాజీ కౌన్సిలర్ పంగరెక్క స్వామి



భువనగిరి, మేజర్‌న్యూస్ : తెలంగాణలో అకాల వర్షంతో పలు ప్రాంతాలు అతలాకుత లమయ్యాయని, రానున్న 2 గంటల్లో తూర్పు, దక్షిణ తెలంగా ణల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసిందని, ఇక హైదరాబాద్ మహానగరంలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపినట్టు భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వాడికి చెందిన మాజీ టిఆర్ఎస్ కౌన్సిలర్ పంగ రెక్క స్వామి అన్నారు. భువనగిరి ప్రాంతాల్లో కురిసిన వర్షంతో మహానగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు అని తెలిపారు.ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోయాయి. వాతావరణంలో తేమ శాతం కనిష్టానికి తగ్గిపోయిందని వాతావరణ శాఖ వారు వివరించారు అని తెలిపారు. దీంతో ఓ వైపు ఎండలు, మరోవైపు ఉక్క పోతతో నగర జీవి ఓ విధమైన అసౌకర్యానికి గురయ్యాడు. అలాంటి వేళ.. ఒక్క సారిగా వాతావరణం మారడం.. దీనికి తోడు భారీగా వర్షం పడడంతో నగర ప్రజలు ఒకింత సాంత్వన చేకూరింది. అయితే ఈ వర్షాలు కురవడం..ఆగిన ఆనంతరం మళ్లీ సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడనే ఓ విధమైన ఆందోళన నగర జీవుల మదిలో మెదులుతోంది. ఇక వర్షాలు కురిస్తే.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా భువనగిరి పట్టణంలోని రామ్‌నగర్, సీతా నగర్, జంఖన్నగూడెం, మోరీలు నిండిపోతే, శుభ్రం చేయిస్తున్న మాజీ కౌన్సిలర్ పంగ రెక్క స్వామి, సబితా గోపాల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ రజిత, జవాన్ నర్సింగ్ రావు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతానం కార్యక్రమంలో పాల్గొన్న కట్టెబోయిన అనిల్ కుమార్







హాలియా, మేజర్‌న్యూస్ : నాగార్జునసాగర్ నియోజకవర్గం అనుముల మండలం చల్మారెడ్డిగూడెం గ్రామవాస్తవ్యులు కట్టెబోయిన కోటయ్య యాదవ్–శోభ కుమార్తె చి"శిరీష ప్రతానం కార్యక్రమంలో పాల్గొని నూతన వధువుని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన ఎ.కె.ఫౌండేషన్ చైర్మన్, హైకోర్ట్ న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జానపాటి సైదులు యాదవ్, మైనార్టీ నాయకులు షేక్ మౌలాలి, రావుల సైదులు యాదవ్, కాట్నం వెంకన్న గౌడ్, రావుల రాము యాదవ్, రావుల కొండయ్య, రావుల రాంబాబు, కట్టెబోయిన శివ, శీలం కోటి యాదవ్, జంపుల సురేష్, మన్నెం కోటి గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని డిసిఓ తనిఖీ



మర్రిగూడ, మేజర్‌న్యూస్ : మండలంలోని శివన్నగూడ సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పిపిసి వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా డిసిఓ వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని వసతులను పరిశీలించి రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పిపిసి కేంద్రం నిర్వాహకులను రైతులకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని రైతులకు కనీసం మౌలిక వసతులు కల్పించాలని అక్కడ ఉన్న సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తాసిల్దార్ శ్రీనివాసులు మర్రిగూడ, యరగండ్లపల్లి, ఖుదాబక్షపల్లి గ్రామాలలో ఉన్న వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ తదితరులు ఉన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన కేతావత్ బీల్యానాయక్

చింతపల్లి, మేజర్‌న్యూస్ : చింతపల్లి మండల పరిధిలో గల వర్కాల గ్రామానికి చెందిన మర్ల సత్తయ్య కుమారుడు శంకర్ యాదవ్‌స్వాతిల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యానాయక్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వింజమూరి రవి, బాల్ సింగ్ నాయక్, మాజి సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, బిచ్చా నాయక్ రవిందర్ రెడ్డి, వింజమూరి కృష్ణయ్య, అబ్బయ్య, బిచ్య నాయక్, కలకుండ యాదయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.